నీ కోసం ఈ కన్నీళ్లు

కొడూరి శ్రీరామమూర్తి MA



ఇందిర బి. ఏ. పేసయింది - నిజమే—

పెళ్లయిపోబట్టి కాని, లేకుంటే ఎమ్మేనో మరేదో పేసయ్యేది—

—ఆ మాటా నిజమేనూ.

అయినంత మాత్రాన తనలోని స్త్రీత్వాన్ని ఒప్పుకోకుండా ఎలా వుంటుంది?- స్త్రీ కోరే గమ్యంలో ఆనందంలేదని ఎలా అనుకుంటుంది?—

లాన్సులో ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తోంది ఇందిర—ఇందిర ఆలోచనలు కాసేపు గతంలోకీ మరి కాసేపు వర్తమానంలోకీ పరిగెట్టి విచిత్రమయిన భావాలను సృష్టిస్తున్నాయి. వాటిని చూచి ఇందిర ఆనందపడుతుందో భయపడుతుందో ఆమెకే తెలియదు. గతాన్ని మరచిపోవాలనే తాపత్రయం—వర్తమానాన్ని గురించి ఆందోళన—భవిష్యత్తును గురించి భయం—ఇందిర చుట్టూ అల్లుకున్నాయి.

నిజానికి—ఇందిర వయస్సు పెద్దదేమీ కాదు. పాతికేళ్లు పైబడుతున్న ఇందిర భావాల్లోనూ, అనుభవాల్లోనూ ఎంతగా ఎదిగిందో కాని, సామాజిక స్థాయిలోనూ ఐశ్వర్యంలోనూ బాగా ఎదిగింది. చిన్నప్పుడు బస్సులో ప్రయాణం చేస్తే మురిసిపోయిన ఇందిర ఇవాళ కాడిలాక్ కారుకూ, దాన్ని పోషిస్తున్న పెద్ద మేడకూ అధికారిణి అయింది.

ఆ అదృష్టమంతా ఆ అమ్మాయి కళ్లల్లో వుందంటాను నేను. ఆర్టిస్టిగ్గా

వుండే ఆ కళ్లు ఇందిరను అందమైన అమ్మాయిగానే కాదు—అందాల రాణిగా కూడా చేశాయి. ఈమాటే ఆ అమ్మాయి దగ్గిర ఎవరన్నా అంటే తియ్యగా నవ్వుతుంది. ఆ నవ్వంటే పడి చచ్చే వాళ్లు ఎంతమందనీ?—

అందులో ప్రకాశం మరీనూ—

కాని—ఆనవ్వు మీద సర్వహక్కులూ గల యజమాని మైకాగనుల కృష్ణమూర్తి.

అదృష్టవశాత్తో లేక దురదృష్టవశాత్తో కృష్ణమూర్తి కవి కా (లే)క పోయాడు గాని లేకుంటే ఇందిర నవ్వుమీద ఓ ప్రబంధం రాసిపారేసి ఇంటింటికీ ఓ కాపీ పంచిపెట్టి వుంచేవాడు -

కృష్ణమూర్తికి తనమీద వున్న పిచ్చి అభిమానం ఇందిరకు తెలియక పోలేదు—నిజానికి అదే ఇవాళ ఆమెను అంతగా భయపెడుతుంది.

ఆరోజు తనకింకా జ్ఞాపకం వుంది—

ఘోరున వర్షం పడిన ఆరోజు-మెరుపులతో ఉరుములతో భయంకరంగావున్న ఆ రోజు-తను ఒంటరిగా కుమిలి కుమిలి ఏడ్చిన రోజు-

ఎలాంటి వికృతమైన జ్ఞాపకాలు!—

భూతద్దంలో పెట్టినట్టుగా డాక్టర్ రామేశ్వరి ముఖం భయంకరంగా కనబడుతోంది—"భగవాన్—గతాన్ని ఎందుకుమరచి పోలేను నేను-" గొణుక్కుంది ఇందిర—

దూరంగా అల్సేషన్ మొరుగుతోంది.-

ప్రక్కన ఏదో అడుగుల చప్పుడు వినబడింది.

"రాణీగారు ఇక్కడున్నారా?- దేవిగారి ఏకాంతసేవకు మేం ఏం చెయ్యాలిట?—" అన్నాడు కృష్ణమూర్తి పక్కన కూర్చుంటూ.

బోరెడంత డబ్బూ—పెద్దమూతా—దానిమీద నాజూకుగా వుండే చిఱుమీసమూ-పిల్లికళ్లూ—పాతచింతకాయజోకులూ—కలిస్తే "కృష్ణమూర్తి" అనే బొమ్మ తయారవుతుంది--కృష్ణమూర్తి అందగాడు కాదు కానీ దానికోసం తాపత్రయం కొంచెం ఎక్కువేను—

కృష్ణమూర్తి మాటలకు మామూల్లాగా ఇందిర నవ్వలేదు—ఎప్పటిలాగా అతని కళ్లల్లోకి చిలిపిగా చూడలేదు—

నిజానికి ఆమెకు అతగాడి మాటలు వినబడటం లేదు—కాలగర్భంలో కలిసి పోయిన డాక్టర్ రామేశ్వరి—ప్రకాశం—ఇంకా—చెప్పలేనిభయం—ఏవేవో జ్ఞాపకం వస్తున్నాయి"

"భగవాన్—గతాన్ని నేనెందుకుమరచి పోలేను—" మరోసారి అనుకుంది—

ఈ మాటలు కృష్ణమూర్తికి వినబడ లేదు—వినబడ్డా ఈ మాటల్లోని లోతులు అతనికి తెలియవు—తెలుసుకోలేడు—

* *

"ఇందూ!—ఎవరొచ్చారోచూడు—" అంది శాంతాదేవి ప్రొద్దున్న అప్పుడే లేచిన కోడలితో—

ఎదురుగా అక్క-నీలవేణికనబడింది—

"కంగ్రాచ్యులేషన్స్—" అంటోంది నీలవేణి—

ఆ మాటలు ఎందుకో ఇందిరకు తెలుసు—తేలిగ్గా, తృప్తిగా, నవ్వింది—

ఇందిర నవ్వడం చూచి శృతికలుపుతూ నవ్వాడు నీలవేణి వడిలో వున్న చిన్నబాబు—

"నీ కొడుకు అందంగా వున్నాడు నీలూ!—" అంది ఇందిర వాడిని ముద్దు పెట్టుకొంటూ—

"ఇంకెన్నాళ్లులే మరో ఏడు నెలలు ఓపికపడితే పండంటి కొడుకు అద్దాలలో వాలబోడులే!-" సరసమాడింది నీలవేణి.

నీలవేణి మాటల్లో ఆశలూరించే భావి అందంగా తొంగి చూచి ఇందిరను గిలిగింతలు పెట్టింది. ఈ ఆనందానికి తను త్వరలోనే అధికారిణి కాబోతోంది-నిండుగా నవ్వుకుంది ఇందిర—

కాని—ఆ నవ్వు వెనకాల ఏవో జ్ఞాపకాలు కలుక్కుమన్నాయి. ఓ నాడు ఈ ఆనందం తనకు భయంకరమైన శాపంగా పరిణమించింది. ఈ నాడు తను కోరుకుంటున్న మాతృత్వాన్ని చూచి ఒకప్పుడు భయపడింది. ఆనాటి వ్యధను సులువుగా మరచిపోలే దామె.

బయటవర్షం, భోరున పడుతూంటే—చీకటిలో ఒంటరిగా ఏడ్చింది తను. ప్రపంచం అంతా ఒక్కటై తనను వేలెత్తి చూపిస్తున్నట్టుగా వెలివేసి ఎగతాళి చేస్తున్నట్టుగా—భయంమీద అసహాయతస్వారీ చేస్తున్నట్టుగా అనిపించింది. ఎలాంటి గతాన్ని తను కడుపులో దాచుకుంది!—

"ఏమిటోయ్ ఇందిరా-భావలోకాల్లో తేలిపోతున్నావు—అతిథుల్తోటి రెండు మాటలు మాటలాడు మరి!"

వేళాకోళం చేస్తోంది నీలవేణి.

* *

భోజనాల దగ్గర అన్నది శాంతాదేవి కోడలితో—

"ఈ సంగతి విన్నావా అమ్మాయ్?" అని.

"ఏమిటది అత్తయ్యా?—" అంది

"పూజకి పూలు కావాలంటూ అస్తమానూ మహాభక్తురాలిలాగా మన గార్డెన్ లోకి వస్తూవుంటుందే—అవధాన్లు గారమ్మాయి సరస్వతి - ఎవడితోనో స్నేహం చేసి కడుపు తెచ్చుకుందిట. కొంపకి అప్రదిష్ట వచ్చిందని అవధాన్లుగారు కూతుర్ని డాక్టరు దగ్గరకు తీసికెళ్ళాడట—అయినా రహస్యం ఎన్నాళ్ళని దాగుతుంది?-ఊరందరికీ తెలిసిపోయింది. పిదపకాలపు బుద్ధులు కాకపోతే తప్పుచేసిన కూతుర్ని కేకలేసి ఆ కుర్రాడిచేత మూడు ముళ్ళూ వేయించే ఏర్పాటు చూస్తాడా—డాక్టర్ దగ్గి

రకు తీసికెళతాడా-ఛీఛీ-లోకానికి బొత్తిగా సిగ్గూ లజ్జా లేకుండా పోతోంది——''

శాంతాదేవి మాటలకు నీలవేణి పుంజుకుంది.

''——అంతేకాదు. ఈ సిగ్గుమాలిన వాళ్ళకు ప్రభుత్వం భరోసా ఇస్తుందటండీ. గర్భస్రావం చేయించుకోవడం తప్పు కాదుట. దానికి ఓ శాసనం కూడా చేస్తారట-అదే కనుక జరిగితే అన్యాయాన్ని పట్టగలమా అని——మొన్న పేపర్లో ఒక వార్త చదివాను. లండన్ నగరంలో డాక్టర్లందరికీ ఇప్పుడిదే ప్రాక్టీసుట——లండన్‌లో గర్భస్రావం నేరంకాదు కదా అని——అనేక దేశాల్నించి అమ్మాయిలు లండన్ వస్తున్నారట——ఎయిరోడ్రోమ్ దిగగానే సరాసరి అస్పత్రులకు వెడుతున్నారట——''

ఇంటరు ఫెయిలయిన నీలవేణికి పనికి రాని పరిజ్ఞానంతోబాటుగా యితరులను 'బోర్' చెయ్యడంలో కూడా మంచి నేర్పుంది,

''ఛీఛీ!-ఇలాంటి పాపపు మాటలు నా దగ్గిర చెప్పకు——ఆ గుండెల్లేని వాళ్ళ గురించి అనుకోవడం కూడా పొరబాటే అయినా గర్భస్రావం అంటే ఏమిటి?——భ్రూణహత్య కాదూ!-గోహత్య, భ్రూణహత్య, సామాన్యమైన పాపాలు కావమ్మాయి. కట్టి గుడు పుతాయి. తరతరాల్ని ఆ పాపం పీల్చి పిప్పిచేస్తుంది——''
కోపంగా అంటోంది శాంతాదేవి.

శాంతాదేవి మాటలు ఇందిర గుండెల్లో బలంగా గుచ్చుకున్నాయి. తననీ - తన పాపాన్నీ ఆమె శపిస్తున్నట్టుగా అనిపించింది. తన శీలాన్ని గేలిచేస్తున్నట్టుగా అనిపించింది - పెగిలివస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక కొంచెంలోనే చెయ్యి కడుక్కుని గబగబా తన గదిలోకి వెళ్ళిపోయింది.

కోడలి ప్రవర్తన అర్థంకాక - తెల్ల బోయింది శాంతాదేవి గదిలోకి వెళ్ళిపోయి ఒంటరిగా తనివితీరా ఏడ్వాలనుకున్న ఇందిరకు ఎదురుగా కనబడింది కేలండర్ మీదవున్న పసిపాప బొమ్మ!-నోట్లో వేలు పెట్టుకుని వెన్నెల్లాగా నవ్వు తున్నాడా బాబు.

అందంగావున్న ఆ కేలండర్‌ను కృష్ణ మూర్తి స్వయంగా ఇందిర గదిలో తగి లించాడు. అంతేకాదు-"ఇందూ! ఇంత అందమైన బాబుకు నువ్వు తల్లివి కావా లంటోంది అమ్మ——" అంటూ 'జోక్' చేశాడు కూడాను. ఆ రోజు ఆ బొమ్మను చూచి హాయిగా నవ్వింది తను.

ఈ రోజు ఆ పసిపాప బొమ్మ తనని భయపెడుతోంది——ఆ పసిపాపలోని అమాయికత్వం తనని దహించి వేస్తోంది.

ఆరేళ్ళ క్రితం జరిగిన కథ కళ్ళ కెదు రుగా కనబడుతోంది——తన యౌవనం చేసిన పొరబాటును డాక్టర్ కామేశ్వరి ఎలా తుడిచిపెట్టిందో జ్ఞాపకం వచ్చింది.

దూరపు బంధువు అయిన హాస్టల్ డాక్టర్ కామేశ్వరి తనను తల్లిలా ఆదు కుంది. మరొకంటికి-కనీసం ఇంట్లోవాళ్ళకు కూడా తెలియకుండా తతంగం పూర్తయి పోయింది. పల్లెటూళ్ళో వున్న తండ్రీ, తోబుట్టువులూ బస్తీలో కాలేజీలో చదువు తున్న ఇందిర టైఫాయిడ్ వచ్చి హాస్ప టల్‌లో చేరిందని అమాయికంగా నమ్మే శారు. డాక్టర్ కామేశ్వరి లోకాన్ని ఎంత సులువుగా నమ్మించింది!——

"చేసిన పొరబాటుకు ఇప్పుడు విచా రించి ప్రయోజనం లేదు. జీవితంలోని ఎదురు దెబ్బలకు తట్టుకోగలిగితేనే మనం మనుషుల్లాగా నిలబడ గలిగేది!" అంటూ తన భుజం తట్టిన డాక్టర్ కామేశ్వరి మాటలు ఇంకా జ్ఞాపకం వున్నాయి. గుండెల్ని రంపపుకోత పెట్టిన ఓదార్పు అది——

బాధగా కళ్ళు మూసుకున్న ఇందిరకు కేలండర్‌లోని పసిపాప భయంకరంగా నవ్వినట్టయింది.

"ఇందిరా!-నన్ను నువ్వు గుర్తుపట్ట లేదు కదూ!-ఒకరోజున నన్ను నువ్వు తుడిచి పెట్టాలనుకున్నా పూర్తిగా పోకుండా ఇంకా నీ కడుపులో మిగిలివున్న పాపాన్ని నేను--నానుంచి నువ్వు తప్పించుకోలేవు- ఏ మాతృత్వాన్నయితే ఓరోజున నువ్వు ద్వేషించావో అదే మాతృత్వాన్ని నువ్వీ రోజున కోరుకుంటున్నావు—— నీకు మాతృత్వం కన్నా మాతృత్వం తెచ్చి పెట్టే గౌరవం ముఖ్యం - నువ్వు తల్లివి కావు-రాక్షసివి-నీ హృదయంలో వున్నవి ప్రేమ, త్యాగాలూ, కావు——స్వార్థానికి, కామానికి నువ్వు ప్రతిరూపం-నీపై నేను కక్ష తీర్చుకుంటాను-నీ ఆశల్ని నేల కూర్చేస్తాను-నువ్వు నీ బిడ్డ అని సగ ర్వంగా చెప్పుకోబోతున్న ఆ శిశువును

కడుపులోనే కబళించి వేస్తాను. ఈ జన్మకు నీకు తల్లినని చెప్పుకునే అర్హత లేకుండా చేస్తాను:-"

భయంకరమైన నవ్వు వినబడుతోంది-

ఇందిరకు ముచ్చెమటలు పోస్తు న్నాయి-కళ్ళు తిరిగిపోతున్నాయి - చెప్ప లేనిభయం-గుండెల్లో రంపపుకోత—

"బాబూ! — నాకు అన్యాయం చెయ్యకు!—"

బలంగా గుండెల్ని అదుముకుంటూ తనలో తను అనుకుంది ఇందిర-

ఇంతలో ఆమె భుజంమీద చెయ్యి పడింది-

"ఏం?—ఇందూ ఒక్కసారిగా అలా అయిపోయావు? - ఎందుకీ కన్నీళ్ళు?-" అనునయంగా అడుగుతుంది అక్క నీల వేణి.

* * *

"ఇందూ! — ఓమంచి "జోక్" వెయ్యనా?—" అన్నాడు కృష్ణమూర్తి తనకు "టై" కడుతున్న ఇందిరతో—

"ఏమిటది?-" అంది ఇందిర మామూలుగా "టైనాట్" ను బిగిస్తూ—

"అదిగో!—ఆ పేతటిక్ పోజువద్ద న్నాను—"జోక్" అనేమాట వినేసరికి సగం నవ్వు ముందుకొచ్చి—"జోక్" వేసేసరికల్లా "ట్రిగ్గర్" నొక్కగానే తుపాకీగుండు దూసుకొచ్చినట్టుగా నవ్వంతా విరజిమ్ముతున్నట్టుగా వచ్చె య్యాలి—"

కృష్ణమూర్తి వేసే ఈచచ్చు "జోక్" లన్నిటికీ ఇదివరకు ఒకప్పుడయితే తీరిగ్గా నవ్వేదామె—ఇప్పు డలాకాదు—

"మీ జోక్లన్నిటికీ నవ్వే ఓపిక నాకు లేదు—అయినా ఏమిటో చెప్పండి—" కొంచెం నిరుత్సాహంగానే అంది ఇందిర కృష్ణమూర్తి కాలర్ సరిచేస్తూ.

ఇందిర మాటలకు కృష్ణమూర్తి నీళ్ళు కారిపోయాడు—

"ఏం మనిషివోయ్ నువ్వు—నిన్నటి నించీ జోక్ని జాగ్రత్తగా దాచుకుని నీకు చెబుదామనుకుంటే నువ్వు విననంటావు కదూ!—నీతో నేనసలు మాట్లాడనే మాట్లాడను—" అన్నాడు నిలువుటద్దం ముందునుంచుని "టైముడి" ని సరిచూచు కుంటూ—

కృష్ణమూర్తి అలిగాడని తెలుసుకుని నవ్వుతూ అంది ఇందిర—

"అంత కోపమైతే ఎలాసార్?— మీరు నవ్వ మన్నంతసేపు నవ్వుతాను— సరేనా?—ఏదీ జోకు వెయ్యండి—నేను రెడీ—" అంది కృష్ణమూర్తి గడ్డం పట్టు కుంటూ—

అంతే! — కృష్ణమూర్తి కోపం తాలూకు టెంపరేచరు ఒక్కసారిగా పడి పోయింది—

ఎడ్వాన్సుగా ఓ చిరునవ్వు పడేసి— సోఫాలో కూర్చుంటూ — ఇందిరను చూస్తూ అన్నాడు కృష్ణమూర్తి —"నిన్న ఆఫీసులో ఓ తమాషా జరిగింది— మధ్యాన్నం ఇంటర్వెల్ టైములో కూర్చుని ముఖ్యమైన ఫైల్స్ చూసుకుంటున్నాను. ఇంతలో పెద్దమనిషి నాకు ఓ చీటీ పంపించాడు—అతగాడు ఎవరో తెలుసా? ఒక డేన్స్ మాస్టరు—డొనేషన్ ఏదయినా ఇమ్మంటాడేమో అనుకున్నాను—అతడు వచ్చి అంటాడు కదా—మీ పిల్లలకి డేన్స్ నేర్పించండి—రెండేళ్ళలో పెర్‌ఫార్మెన్స్ ఇప్పించే పూచీ నాది అని—అతగాడి మాటలు చూస్తే నవ్వాలో ఏడవాలో తెలియలేదు — "బహువచనందాకా వెళ్ళిపోయావు—నాకింకా ఏకవచనం కూడా లేదు—నువ్వు సరిఅయిన ఎడ్రస్‌కే వచ్చావు గానీ—ఏడేళ్ళముందు వచ్చావు-తర్వాత కనబడు—" అని చెప్పాను-"

అతడి మాటలకు నవ్వుతూ అంది ఇందిర—

"అయితే మీ అమ్మాయికి డేన్స్ నేర్పిస్తారన్నమాట!—"

"ఒట్టి చెప్పించడమేనా?—అందులో ఎక్స్‌పర్ట్‌ని చేయించేస్తాను — ఇంటర్నేషనల్ పెర్‌ఫార్మెన్స్‌లు ఇప్పిస్తాను—"

"బాగున్నాయి పగటికలలు—గుర్రం లాడం దొరికింది కదా అని—గుర్రపుబగ్గీ దొరికినంత సంతోషించాడట వెనకటికి ఓ ప్రబుద్ధుడు— ఉద్యోగంలేని డేన్స్ మాస్టర్ దొరికాడు కదా అని మీ ఊహలకు అంతులేకుండా పోతోంది—" పకపకా నవ్వుతోంది ఇందిర—

ఇందిర నవ్వుతూంటే ఉడుక్కున్నట్టుగా మొహంపెట్టాడు కృష్ణమూర్తి-

"అవున్లే—నువ్వు అలాగే నవ్వు తావు—అయినా నీకు ఆడపిల్లలకి తల్లి కావడం ఇష్టంలేదు—ఒకవేళ అయినా ఆ అందమైన ముక్కును ఇవ్వడం అసలు ఇష్టంలేదు—" అంటూ మూలిగాడు—

కృష్ణమూర్తి నవ్వినప్పుడుకన్నా అలిగినప్పుడే ఎక్కువ బాగుంటాడు ఇందిరకి—చిన్నగా నవ్వుకుందామె.

నిజానికి—తన అందాన్ని మూస పోసుకున్న కూతురు పుట్టడంకన్నా ఇందిరకు కావల్సింది ఏమీలేదు—మరి ఆ అందానికి వజ్ర వైఢూర్యాలు పొదుగుతానంటున్నాడు కృష్ణమూర్తి — ఇంతకన్నా ఏం కావాలి తనకి—తియ్యటి భావాలు ఆమెలో ముప్పిరిగొన్నాయి—

చిన్నతనంలో — పక్కింటి ప్లీడరు గారి అమ్మాయి డేన్స్ నేర్చుకుంటూంటే చూచి సరదాపడి తనూ డేన్స్ నేర్చుకుంటానంటే-"మనం సంసారుల మమ్మా-తగుదునమ్మా అని గజ్జెకట్టి రంగ మెక్కడానికి ఇది బజారు కొంపకాదు—అయినా నీ ఇష్టం—మీ నాన్నగారిష్టం—" అని సవతితల్లి మూతిని అష్టవంకరలు తిప్పడం జ్ఞాపకం వచ్చింది-ఆరోజు తను ఎంతటి అవమానంతో క్రుంగిపోయిందో-కుప్పగా కూలిపోయిన తన ఆశలు గుండెల్లో ఎంతటి భయంకరమైన బాధను చెలరేపిందీ—తన కీనాటికీ జ్ఞాపకం వుంది-

తను మాతృవిహీనగా — అదృష్ట విహీనగా—పుట్టింది—కాని, తనకు పుట్టబోయే శిశువు తనకోసం ప్రాణాలనయినా ఇవ్వగల మాతృ హృదయాన్ని, అదృష్టాన్ని ఒలిచి చేతులో పెట్టగల తండ్రిప్రేమనూ కలబోసుకుని పుట్టబోతోంది— మైడార్లింగ్-నీ అదృష్టాన్ని చూడటంకన్నా నాజీవితంలో కోరికలేదు-భారంగా కళ్లు మూసుకుంది ఇందిర—

ఇంతలో ఎక్కడినించి వచ్చిందో శాంతాదేవి రానేవచ్చింది—

"అమ్మాయ్!-ఈ ప్రసాదం తీసుకో! నీకు పండంటి మొగపిల్లవాడు పుట్టాలని గుళ్లో పూజచేయించాను—" అందామె-

తల్లిమాటలు కృష్ణమూర్తికి సుతారామూ నచ్చలేదు—"ఈ ఆడవాళ్ళందరూ ఇంతేరా బాబూ!—" అని గొనుక్కుంటూ వెళ్ళిపోయాడు—

అత్తగారు వెళ్ళిపోయిన తర్వాత సన్నగా నవ్వుతూ ప్రసాదం తీసుకోబోతున్న ఇందిరకు గుండెల్లో భయంకరమైన నవ్వు వినబడింది—ఆ నవ్వును తను మరచిపోలేదు—అహర్నిశలూ తనను వెన్నాడుతున్న ఆ నవ్వునించి తను పారిపోలేదు—

"లేదు. లేదు—అలా జరగడానికి వీల్లేదు-నా పాపానికి నా బిడ్డకు అన్యాయం జరగడానికి వీల్లేదు-నా బొందిలో ప్రాణం వుండగా ఈ ఘోరం జరగనివ్వను—"



వళ్లుతెలియని కోపంలో ఊగిపోయింది ఇందిర—

* *

మధ్యాహ్నం ఇందిర మేడమీద డ్రాయింగ్ రూములో కూర్చుని వుండగా వంటవాడు నాయర్ కాఫీ "ట్రే"తో వచ్చాడు—

ఇందిర కాఫీ కలుపుతూ వుండగా నాయర్ అన్నాడు—"నీలవేణమ్మగారి బాబు మనింటికి వస్తేనే ఇల్లంతా సందడితో నిండిపోయింది—ఇక మీకడుపున ఓదీపం వెలిగిందంటే మా అందరికీ చేతినిండా పనే వుంటుందమ్మా—ఇంటికి పిల్లలే కదమ్మా ఐశ్వర్యం!—"

నాయర్ మాటలకు ఇందిర నవ్వుకుంది నిండుగా—"నిజమేనూ" అంది ఆమెలో మాతృత్వం—

కాఫీ త్రాగుతున్న ఇందిరతో నాయర్ అన్నాడు

"నాదో చిన్నమనవండి—"

"ఏమిటది?—" మామూలుగా అంది ఇందిర—

"ఏమీలేదండి—నా ఒక్కడి సంపాదనతోనూ ఇల్లుగడవటం లేదు—పురిటి సమయంలో మీకు ఆసరాగానూ వుంటుంది—ఆతర్వాత బుల్లి జమీందారు గారికి ఆయాగానూ వుంటుంది—అని మా ఆవిడను తమదగ్గిర నౌకరీకి పెడదామనుకుంటున్నాను—తమరు ఈవిషయంలో పెద్దమ్మగారికి కాస్త రెకమండేషను ఇప్పించాలి-"

నాయర్ మాటలు వింటూంటే ఇందిరకు ఏమనాలో తెలియలేదు. తన మాతృత్వం మీద ఎందరికి ఎన్ని ఆశలు?—

అందమైన కళాకారిణికి తండ్రికావాలని కృష్ణమూర్తికి ఆశ—తండ్రిని మించిన కొడుకై ఓడలకూ, మేడలకూ, అధిపతి అయ్యే కోటీశ్వరుడికి నాయనమ్మ కావాలని శాంతాదేవి ఆశ—ఇక పోతే నాయర్ కు ఆయాఉద్యోగం మీద ఆశ—

ఇందరి ఆశల్ని కోరికల్ని తీర్చగలదా తను?—భారంగా నిట్టూర్చింది ఇందిర—

నాయర్ కాఫీ "ట్రే" తీసుకొని వెళ్ళి పోతూండగా నీలవేణి అక్కడకువచ్చింది-

"ఏమండి!—ఇందిరాదేవిగారు!—ఒంటరిగా తపస్సు చేస్తున్నారు—బావగారి రాక కోసమేనా?—" అంటూ—

"అదేం లేదు—ఎంతసేపు తపస్సు చేసినా ఆయనప్రత్యక్షం కారని తెలుసుగా-ఇవాళ డైరెక్టర్ల బోర్డువుంది-" నవ్వుతూ అంది ఇందిర—

ఇందిర నీలవేణితో ఉంటే నీలవేణి వడిలో ఉన్న బాబు తనకాళ్ళను ఆడిస్తూ-తనలో తాను ఏదో ఆనందిస్తున్నాడు—

అదిచూచి ఇందిర—"మీవాడు మంచి ఉషారుగా ఉన్నాడే—" అంటూ వాడిని నీలవేణి వడిలోంచి తీసుకుంది—

"ఆ ముక్కు అంతానీదే నీలూ!—" అంది ఆ చిన్నవాడిని ముద్దుపెట్టుకుంటూ--

ఇంతలో క్రిందనుంచి శాంతాదేవి పిలుపు వినబడింది—

"మీ అత్తగారు పిలుస్తున్నారు—ఇప్పుడే వస్తాను ఉండు—" అంటూ క్రిందకు వెళ్ళిపోయింది.

మేడమీద ఇందిర బాబుతో ఒంటరిగా ఉండిపోయింది—

బాబును పలకరిస్తూ—వాడితో ఏవేవో పెద్ద మాటలు మాట్లాడేస్తూ వాడిని నవ్విస్తోంది ఇందిర—వాడు హాయిగా నవ్వుతూంటే సర్వాన్నీ మరిచి ఆనందించిందామె.

"పండంటి మొగపిల్లవాడు పుట్టాలి-" అని అత్తగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి—ఎంత తియ్యటి అనుభూతి!-

ఇంతలో ఆమె గుండెల్లోంచి వికటాట్టహాసం వినబడింది—

ఇందిరా!—నీకు ఇంకా భవిష్యత్తు మీద ఆశ-నమ్మకం-చావలేదన్నమాట—నువ్వుతల్లి కావడం అసంభవం-నీ కడుపులోని శిశువు బ్రతికి బయట పడటం జరగనిపని—నువ్వుతల్లిగా అనర్హురాలవు—ఏరోజునయితే నీ కడుపులో పెరుగుతున్న నన్ను తుదముట్టించాలని చూశావో—ఆనాడే నువ్వా స్థానాన్ని కోల్పోయావు-ఐశ్వర్యం అంచుమీద కూర్చున్నంత మాత్రాన ప్రపంచాన్నంతటినీ జయించగలనను కుంటున్నావు కాబోలు-డబ్బుకూ, అధికారానికి, లొంగని నైతికశక్తికి ఎదురులేనిదని మరచిపోకు—ఆశక్తితోనే నేను నీ ఆశల్ని సమూలంగా నాశనం చేస్తాను—నీ కోరికమీద గోరీకడతాను—" కసితో భయంకరంగా నవ్వుతున్నాడు ముక్కలుకాకుండా మిగిలిన ప్రకాశం ప్రతిరూపం.



నిజం పలుకుతున్న కఠోరవాక్యాలు ఇందిర తలను బ్రద్దలు చేస్తున్నాయి. తన క్రిందవున్న భూమంతా గిరగిరా తిరుగుతున్నట్టూ—ఏదో పైశాచిక శక్తి తనను చుట్టుముట్టినట్టూ అనిపించింది—

"నే నెందుకీ పాపం చేశాను?—నా కెందుకీ శిక్ష?—" అంటూ అసహాయతతో తల బాదుకుం దామె.

ఇందిర పడుతున్న మానసిక వేదనను ఒక ఆటలాగా భావించి ఆమె వడిలోవున్న పసిబాబు పకపకానవ్వాడు.

ఆ నవ్వు ఇందిరకు భయాన్ని కలిగించింది—

తనపీ—తన పాపాన్నీ ఆ బాబు హేళన చేస్తున్నట్టు అని పించింది.

"నీకుకూడా లోకువ అయిపోయానా?-నా బ్రతుకు అంత చులకన అయి పోయిందా?—నిన్నేం చేస్తానో చూడు-" అంటూ ఆ పసి బాబు పీక నులిమివెయ్య బోయింది ఇందిర—

సమయానికి అక్కడికి వచ్చిన నీలవేణి ఇది చూచి నిశ్చేష్టురాలయిపోయి "ఇందిరా!—ఏమిటి నువ్వు చేస్తున్న పని?—" అని తీక్షణస్వరంతో అంటూ-బాబుని ఇందిర దగ్గరనించి విసురుగా లాక్కుంది.

"అవును—వీడిని చంపేస్తాను నేను-నేను రాక్షసిని—హంతకురాలిని - నన్ను ఎవరూ అడ్డుపెట్టలేరు—నీ కళ్ళ ఎదుటే వీడి పీక నులిమేస్తాను-" భయంకరంగా కేకలు పెడుతోంది ఇందిర—

ఆ కేకలువిని ఇంట్లో వాళ్ళందరూ అక్కడికి పరిగెట్టుకు వచ్చారు.

"ఏమైంది ఇందూ— నీ కేమైంది?-" అంటూ ఖంగారు పడి కోడలి భుజం పట్టుకుంది శాంతాదేవి—

అప్పటికే ఇందిర స్పృహతప్పి పడి పోయింది.

* *

ఇందిర స్పృహ లేకుండా వుందని తెలియగానే కృష్ణమూర్తి హటాహుటిని ఆఫీసునుంచి వచ్చాడు—

కృష్ణమూర్తి మేడమీదకు వెడుతూండ గానే మెట్ల దగ్గిర డాక్టర్ శర్మ ఎదు రయ్యాడు—"నో, మిసెస్ మూర్తి ఈజ్ ఆల్ రైట్—కొంచెం మెంటల్ షాక్ తగిలింది—మానసికంగా బాగా విశ్రాంతి అవసరం—అంతకు మించి ఆందోళన పడనవసరం లేదు ." అంటూ తన మెడికల్ రిపోర్టు గడగడా చెప్పేశాడు కృష్ణమూర్తికి.

తేలికపడ్డ హృదయంతో కృష్ణమూర్తి ఇందిర గదిలోకి వచ్చాడు—దాదాపుగా నిద్రావస్థలో ఉన్న ఇందిర కృష్ణమూర్తి అడుగుల చప్పుడు విని కళ్లు తెరిచింది—

"ఏమిటి అల్లరిచేస్తున్నావట?—" అన్నాడు కృష్ణమూర్తి ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చుంటూ—

నవ్వు రాకపోయినా బలంగా నవ్వు తెచ్చుకుంది ఇందిర——

"అదిగో—మా ఇందిర నవ్వేసింది- ఇంత త్వరలోనే నయమై పోయింది— డాక్టర్ ఏ ఆందోళనా అక్కరలేదన్నాడు-" అన్నాడు భార్యకు ఉత్సాహాన్నిచ్చే ఉద్దేశంతో—

"డాక్టర్ చెప్పనవసరం లేదు—నా కున్న జబ్బు ఏమిటో నాకు తెలుసు— ఈ జబ్బు డాక్టర్ల వల్లా మందుల వల్లా కుదిరేది కాదు—నా కిప్పుడు చావుకన్నా బ్రతుకంటేనే ఎక్కువ భయం వేస్తోంది-" అంది ఇందిర గాద్గదికమైన స్వరంతో—

"ఇందిరా!--ఏమిటిది?—" అన్నాడు కృష్ణమూర్తి ఆమె మాటలను అర్థం చేసుకోలేక—

"అవును—నేను మీకు ఎన్నో చెప్పాలనుకుంటున్నాను—ఏమీ చెప్పలేక పోతున్నాను—నేను పాపాత్మురాలినే కాదు—పిరికిదాన్ని కూడా—" అంది గాద్గదికమైన స్వరంతో—

కృష్ణమూర్తికి ఈ మాటలు కోపాన్ని తెప్పించాయి—

"యుఆర్ టాకింగ్ నాన్సెన్స్—" అన్నాడు ఉద్రేకంతో--"నిజమే—నేను మాట్లాడే మాటలకి అర్థంలేదు—నేను పిచ్చిదాన్ని—నా తప్పుల్ని క్షమిస్తారు కదూ!—" అంది ఇందిర కృష్ణమూర్తి చేతులను తన గుండెలకు బలంగా అదుము కుంటూ—కన్నీళ్లు తిరిగేకళ్ళతో—

"ఏమిటది ఇందూ " అన్నాడు కృష్ణమూర్తి భయంతో కంపించే గొంతుకతో—

"నా కోరిక ఓటి నెరవేరుస్తారా?—" అంది ఇందిర కృష్ణమూర్తి కళ్ళల్లోకి జాలిగాచూస్తూ—



"ఏమిటిది:-" అన్నాడు కృష్ణమూర్తి

బెజవాడలో కామేశ్వరి అని ఒక లేడీ డాక్టర్ వున్నారు. ఆవిడకు ఫోన్ చేసి-నేను రమ్మన్నానని చెప్పి ఇక్కడకు వచ్చే ఏర్పాటు చెయ్యండి."

"అంతేనా? కామేశ్వరి కాదు. ఇంకా ఎంత పెద్ద డాక్టర్నయినా పిలిపిస్తాను. నా ప్రాణమైనా యిచ్చి నిన్ను బ్రతికించుకుంటాను." అన్నాడు కృష్ణమూర్తి భార్య తలను ఆప్యాయంగా నిమురుతూ.

కృష్ణమూర్తి చెయ్యిని తన చెయ్యిలో బలంగా అదుముతూ అంది ఇందిర——
"చాలు-ఈ చల్లని మాటలు చాలు - నాకు ఇక ఏ మందూ అక్కరలేదు. సుఖంగా చచ్చిపోతాను-"

ఇందిర చెక్కిళ్ళమీదుగా ధారలుగా జాలు వారుతున్న కన్నీటినీ, ఆమె మాటలనూ చూచి తెల్లబోయాడు కృష్ణమూర్తి.

* *

డాక్టర్ కామేశ్వరి వచ్చిన తర్వాత కృష్ణమూర్తీ, శాంతాదేవీ, ఎంతో 'రిలీఫ్' ఫీలయ్యారు. ఇందిర చెప్పిన మాటల్ని బట్టి డాక్టర్ కామేశ్వరి ఆ జబ్బును శాస్త్రం చేత్తోలాగి అవతల పారేస్తుందన్న వెర్రి నమ్మకం కలిగింది వాళ్ళకు.

రాత్రివేళ పడుకోబోయేముందు ఇందిరకు ఇంజక్షన్ ఇవ్వడానికి ఆమె గదిలోకి

వెళ్ళిన డాక్టర్ కామేశ్వరి ఇందిరతో అంది—

"ఇందూ! — నువ్వు అదృష్టవంతు రాలవని నాకు తెలుసు గానీ-ఇంత అదృష్ట వంతురాలవని ఊహించలేక పో యా నోయ్—రియల్లీ ఐ ఎన్వీ ఇట్-"

కామేశ్వరి కళ్ళముందు తనకున్న కాడి లాక్ కార్లు-మైకాగనులు - కరెన్సీనోట్లు - విన్యాసం చేస్తున్నాయని ఇందిరకు తెలుసు.

"నేను అదృష్టవంతురాల్నా?-"

"మరి?-" అంది డాక్టర్ కామేశ్వరి మందును సిరంజ్‌లోకి ఎక్కిస్తూ.

ఇక-కామేశ్వరి చేయబోయే దేమిటో ఇందిరకు తెలుసు.

"ప్లీజ్-డాక్టర్-మిమ్మల్ని బ్రతిమాలు కుంటాను. నాకు వైద్యం చెయ్యకండి. నేను మిమ్మల్ని శ్రమపెట్టి ఇక్కడకు రప్పించింది వైద్యం చేయించుకోడానికి కాదు-" అంది ఇందిర కన్నీళ్ళను తుడుచు కుంటూ.

ఇందిర మాటలు కామేశ్వరికి అర్థం కాలేదు.

"దయచేసి ఆ తలుపులు వేసి నా దగ్గ రగా రండి - నా గుండెల్లోని బాధను మీ ఒక్కరితోనయినా చెప్పుకోనివ్వండి—"

"ఏమిటమ్మా అది?-" ఆశ్చర్యంగా అంది కామేశ్వరి తలుపులు వేసి పక్కన కూర్చుంటూ.

"ఆరేళ్ళక్రితం పాప పంకిలంతో మీ డిస్పెన్సరీలోకి వచ్చిన నన్ను ఆదుకుని కన్న తల్లిలా కాపాడారు జ్ఞాపకం వుందా?-" అంది ఇందిర దీనస్వరంతో.

"అవును-" గంభీరంగా తల పంకిం చింది డాక్టర్ కామేశ్వరి.

"ఆనాడు మీరు నాకు చేసిన ఉపకారమే ఇవాళ నా పాలిట శాపమై నన్ను భయ పెడుతోంది. నన్ను నిలువునా కాల్చే స్తోంది-నే నీ బాధను భరించలేక పోతు న్నాను డాక్టర్-" అంది ఇందిర ముఖాన్ని చేతుల్తో కప్పుకుంటూ.

ఇందిర మాటలు విని ఆమె భుజం తడుతూ అంది కామేశ్వరి - "యు ఆర్ టూ సెన్సిటివ్!-జీవితంలో చేదును మరచి పోలేక పోతే మనిషికి మనుగడే లేదు. అయినా - ఎప్పుడో జరిగిన విషయాల ప్రసక్తి ఇప్పుడెందుకు వచ్చింది?-"

"అదే నాకూ అర్థంకాలేదు డాక్టర్ - నాకు నెల తప్పిందని తెలిసిన నాటినుంచీ ఏదో అదృశ్య శక్తి నన్ను వెన్నాడు తోంది-నేను చేసిన పాపాన్ని భయం కరంగా నా ముందు వుంచుతుంది-నాకు చాలా భయంగా వుంది. నే నీ పాపాన్ని దాచుకోలేను. అది నావల్లకాదు. చేసిన తప్పును నలుగురికీ చెప్పేస్తాను. అందరూ నన్ను అసహ్యించుకుంటేనే కాని తృప్తి లేదు. ఆ నాటినుండి నన్ను వెన్నాడు తున్న ఈ పిశాచం నించి నేను బయట

పడలేను. నేను చేసిన తప్పుకు ఇక్కడే ఈ లోకంలో నేశిక్ష లభించాలి. నా కారణంగా నా బిడ్డ బలి అయిపోతే అది చూచి భరించలేను డాక్టర్!—'' గాద్గదికమైన స్వరంతో అంటోంది ఇందిర.

''ఇందూ-నువ్వు చాలా అమాయకురాలివి. నీ ఆవేశంవల్ల వచ్చే పరిణామాలను కనీసం ఊహించుకోలేక పోతున్నావు-నీ మాటలు వింటూంటే నాకు జాలే కాదు-నవ్వు కూడా వస్తోంది—''

''నవ్వండి డాక్టర్!-కసిదీరా నవ్వండి-జీవితంలో ఒక్కసారి పొరబాటు చేసి చిత్రహింస పడుతున్న నన్ను చూసి నలుగురితోబాటుగా మీరూ నవ్వండి. కాని - ఒక్క కోరిక. ఇది ఒక రోగి కోరిక కాదు డాక్టర్-చావుబ్రతుకుల మధ్య నున్న ఒక అమాయకురాలి అభ్యర్థన. ఈ ఇంట్లో వాళ్ళందరూ గుడ్డిగా నన్ను అభిమానిస్తున్నారు. నా మీద ప్రేమ, జాలి, చూపడం మినహాగా వాళ్ళకేమీ తెలియదు-నేను ఇప్పుడు ఏం మాట్లాడినా వాళ్ళు నమ్మరు. ఒక రోగిష్టిదాని మాటల్లాగా - ఒక పిచ్చిదాని ప్రేలాపనలాగా కొట్టిపారేస్తారు. అందుచేతనే నేను మిమ్మల్ని ఇక్కడికి పిలిపించాను. మరి కొద్ది క్షణాలలో నేను ధర్మదేవత ఎదుట నిర్భయంగా నిలుచోవాలనుకుంటున్నాను. దానికి మీ సహకారం కావాలి. నేను చెప్పేవన్నీ నిజాలని కృష్ణమూర్తి, అత్తయ్యా నమ్మేందుకుగాను మీ సాక్ష్యం కావాలి-'' ఉద్రేకంతో ఆమె మాటలు తడబడుతున్నాయి.

''నీ మాటలకు అర్థంలేదు - డాక్టర్ వృత్తి ధర్మం మనుషులను బ్రతికించడమే కాని చంపడం కాదు - అనవసరమైన నిజాన్ని ఇప్పుడు చెప్పి నా చేతులతో నేను నిన్ను హత్య చెయ్యలేను. కాని - నువ్వు ఓ విషయాన్ని జ్ఞాపకం వుంచుకోవాలి. నైతికదృష్టితో చూచినప్పుడు మనం ఆలోచించాల్సింది మనిషి తప్పు చేశాడా లేదా అని కాదు. చేసిన పాపానికి పశ్చాత్తాపం పొందుతున్నాడా లేదా అని-నిజమైన పశ్చాత్తాపం ఎంతటి పాపాన్నయినా క్షాళితం చేస్తుంది. అదీకాక-నువ్వు చేసింది పాపం కాదు-పొరబాటు-నైతిక సూత్రాలను తన జీవిత ధ్యేయంగా నమ్మిన మహాత్ముడు కాలుజారిన స్త్రీలపై కరుణ చూపించాడు. కాని-చిత్ర మేమంటే నువ్వు నీ మీదనే జాలి చూపించుకోలేక పోతున్నావు. గర్భస్రావమన్నది ధర్మశాస్త్ర ప్రకారం తప్పిదమే కావచ్చు. కాని-నీ విషయంలో నేను ఆ రోజు ఉదాసీనత చూపించివుంటే ఒక అమాయకురాలి జీవితాన్ని నేను బలిగొన్న దాన్నయి వుండేదాన్ని-చట్టంకన్నా - నీతి కన్నా-గొప్పది మానవత్వం. నీతులూ, చట్టాలూ, మనుషులు తయారు చేసినవి. కాని - మానవత్వమే దేముడి శాసనం- ఆ దైవ శాసనాన్నే నువ్వూ, నేనూ, అనుస



రించాం. ఇందులో బాధ పడాల్సిందీ, భయపడాల్సిందీ ఏమీలేదు—''

ఇందిర ఏం మాట్లాడలేదు. మౌనంగా కన్నీళ్ళు తుడుచుకుంది.

* *

డాక్టర్ కామేశ్వరి ఇంతదూరం ప్రయాణం చేసివచ్చి బోలెడన్ని మందులు పోసి ఇందిర బాధ యావత్తూ తీసి పారెయ్యలేక పోయింది—నిజమే—

అయితే—ఆమె ఇందిరకు కొండంత మనస్థయిర్యాన్ని ఈయ గలిగింది.

ఈ మనస్థయిర్యం పాపాన్ని దాచు కునేందుకుగాను ఇందిరకు దట్టమయిన ముసుగును అల్లి పెడుతుందనుకుంది కామేశ్వరి.

కాని—ఆ మనస్థయిర్యంతో ఉన్న ముసుగును కూడా ధైర్యంగా తొలగించ గల బలాన్ని పుంజుకుంది ఇందిర—

ఆశక్తితోనే ఆమె — జరిగిందంతా తెలుపుతూ కృష్ణమూర్తికి ఓ సుదీర్ఘమైన లేఖ వ్రాసింది.—ఓ వారం రోజుల తర్వాత.

తన మనోవ్యధకు అడ్డంలావున్న ఆ ఉత్తరాన్ని కృష్ణమూర్తి గదిలో టీపాయ్ మీదవున్న ''వార్ అండ్‌పీస్'' పుస్తకం మధ్యలో పెడుతూ అనుకుంది ఇందిర—

''రాత్రి కృష్ణమూర్తి తప్పకుండా ఈ పుస్తకం చదువుతాడు—అప్పుడు తప్ప కుండా నా వుత్తరం అతనికంట బడు తుంది—ఈ రోజుతో కృష్ణమూర్తి నన్ను అసహ్యించుకుని ఇంట్లోంచి గెంటెయ్యా నన్నా గెంటెయ్యాలి. లేదా నిండు హృదయంతో క్షమించి నా పాపాన్ని కడిగెయ్యనన్నా కడిగెయ్యాలి—రెండోదే

కనుక జరిగితే నా అంత అదృష్టవంతులు మరొకరు వుండబోరు—''

*   *

రోజులు దొర్లిపోతున్నాయి - మామూలుగానే—

కాని—కృష్ణమూర్తిలో చెప్పుకోదగ్గ మార్పు ఏదీ కనబడలేదు—ఎప్పటిలాగా నవ్వుతూ మాట్లాడుతున్నాడు — చెత్త ''జోక్''లు వేసి నవ్వమని ఇందిరను బలవంత పెడుతున్నాడు--నవ్వితే సంబర పడి పోతున్నాడు.

కృష్ణమూర్తి ముఖకవళికల్నీ, భావాల్నీ, శ్రద్ధగా గమనిస్తూ అతడిలో మార్పుకు ఆరాట పడుతున్న ఇందిరను కృష్ణమూర్తి బొత్తిగా ''డిసప్పాయింట్'' చేశాడు—

అయితే ఆ ''డిసప్పాయింట్‌మెంట్'' లోబోలెడంత ఆతృత కూడా వుంది—

కృష్ణమూర్తి ఉదాత్తుడో—అమాయకుడో—తెలియడం లేదు ఇందిరకు—

ఒట్టి భోళామనిషిలా కనబడే కృష్ణమూర్తిలో ఇంతటి ఉదాత్త స్వభావమున్నదా?—నమ్మలేక పోతోందామె.

నవ్వాలో — ఏడవాలో తెలియని పరిస్థితి.

ఇంతకీ అతగాడు ఉత్తరం చదివాడో లేదో అంతుబట్టడం లేదామెకు—

దీనికి తగ్గట్టుగా ప్రక్కరోజునించీ ''వార్ అండ్ పీస్'' పుస్తకం కూడా కృష్ణమూర్తి గదిలో కనబడటం లేదు—

ఏమైపోయినట్టు?—

''ఆ ఎర్ర అట్టఉన్న పుస్తకమాండి-బాబుగారు మొన్న ఆఫీసుకు పట్టుకెళ్లారు'' నౌఖరు వెంకన్న సాక్ష్యం చెప్పాడు.

కృష్ణమూర్తి జోళ్ళు పాలిష్ చెయ్యడం దగ్గర్నించి—అతగాడిని కారులో కూర్చొ పెట్టడంవరకూ వెంకన్నదే బాధ్యత.

వెంకన్న మాటలు ఇందిరకు ఎంతో సంతృప్తి నిచ్చాయి.

సీరియస్‌గా ఏ పుస్తకాన్నయినా చదవాలనుకున్నప్పుడు ఆఫీసుకు పుస్తకాన్ని తీసుకుపోయి — విశ్రాంతి సమయాల్లో చదువుకోవడం కృష్ణమూర్తికి అలవాటు.

అయితే — సందేహంలేదు — కృష్ణమూర్తి తప్పకుండా తన ఉత్తరాన్ని చదివే వుంటాడు—

గుండెల్లోంచి ఒక్కసారిగా ఎంతో బరువు దిగినట్టయింది—తను ఎన్నో నాళ్లుగా చెయ్యాలనుకుంటున్నపనిని చెయ్యగలిగాననే గర్వము—తన సంగతి తెలిసికూడా కృష్ణమూర్తి మనస్ఫూర్తిగా క్షమించాడనే సంతోషమూ ఇందిరను ఉక్కిరి బిక్కిరి చేశాయి.

''కృష్ణమూర్తీ!—నువ్వు దేవుడివి. అయామ్ రియల్లీ ప్రౌడ్ ఆఫ్‌యూ—'' ఆనందంతో గొణుక్కుంది ఇందిర—

గుండెల్లోంచి రక్తాన్నితీసి కృష్ణమూర్తి పాదాలమీద జల్లేయాలని పించిందామెకు అక్షణంలో—



ఈ అనుభూతిలోని ఆనందమే ఇందిరకు కొండంత బలాన్నిచ్చింది—

ఆ బలంతోనే ఆమె తనచుట్టూ అల్లుకున్న పైశాచిక శక్తిని పటాపంచలు చెయ్య గలిగింది—

అచ్చం తనలాటి ముక్కు—వున్న పుత్రికోత్సాహంతో కృష్ణమూర్తిని ముంచెత్తి వేయగలిగింది—

కృష్ణమూర్తికి కూతురు పుట్టిందని మేడలోని నాలుగంతస్థులు—కాడిలాక్ కార్లూ-బొచ్చుకుక్కలూ-వెరసి అందరూ పండుగ చేసుకున్నారు (యి).

అయితే—కథ ఇంతటితో అయిపోలేదు.

* *

ఇది జరిగిన ఆరునెల్లకి కాబోలు ఫారెన్ వెళ్ళబోతున్న మిత్రుడికి విందు ఏర్పాటు చేశాడు కృష్ణమూర్తి—ఆ సందర్భంలో ఒకానొక "డ్రాయింగ్ రూమ్ డిస్కషన్"లో కృష్ణమూర్తి అంటాడు కదా—

"ఏమిటోనండి—గొప్ప పుస్తకాలని ప్రపంచమంతా పొగిడే వాటిలో చాలా మటుకు పుస్తకాల్ని చాలామంది చదవకుండానే పొగుడు తారని నా ఉద్దేశం—మొన్నా మధ్య "స్టాక్ బ్రోకర్" విశ్వనాథం- "వార్ అండ్ పీస్" నవలను గురించి గొప్పగా పొగిడేస్తే ఎలావుంటుందోనని లైబ్రరీనించి తెప్పించాను—మూడు పేజీలు చదివి బోర్ కొడితే ప్రక్క రోజున భద్రంగా లైబ్రరీకి అప్పగించాను. నాబోటిగాళ్లు అంతటి "హర్డ్ రీడింగ్" చెయ్యలేరు—ఏ పెర్రీమేజన్ పుస్తకమో

అయితే హాయిగా వుంటుంది—ఏమం టారు?—''

అక్కడే వున్న ఇందిర ఈ మాటలకు ఉలిక్కి పడింది—హఠాత్తుగా ఆమె మస్తిష్కంలో ఎన్నెన్నో భావాలు వేగంగా కదలాడి పోయాయి.

'' అంటే మీరా పుస్తకం చదవ లేదా?—''అంది తడబడే గొంతుకతో—

భార్య మాటలకు నవ్వుతూ అన్నాడు కృష్ణమూర్తి—'' అబ్బే—లేదోయి-నాకు అంతపాటి తీరిక ఎక్కడిది?—రెండో పేజీ దాటి అసలు ముట్టనేలేదు - వెంటనే ఆఫీస్ ప్యూన్ రాములుచేత లైబ్రరీకి పంపించే శాను . .''

ఇందిరకు కృష్ణమూర్తి మాటలు విన బడటం లేదు.

తన క్రిందవున్న భూమంతా తిరుగు తున్నట్టని పించింది. అయితే—తను రాసిన ఉత్తరం ఏమైపోయింది?—

కృష్ణమూర్తికి కూడా తను చెప్పుకో డానికి సిగ్గుపడే రహస్యాలు—తని జీవి తంలోని అసహ్యాకరమైన సత్యాలు—అందరికీ అందు బాటులో వుండేలాగ—పబ్లిక్ లైబ్రరీలోని పుస్తకంలో ఇక వూహించుకోలేక పోయిందామె.

తను వూహించుకున్న ఆనందం—భయం—రెండూ అసత్యాలే అనే విచిత్ర మైన సత్యం ఆమె కళ్ళ ఎదుటగాలించి వెకిలి నవ్వు నవ్వి నట్టని పించింది.

ఆమె కనుకొలుకుల్లోంచి కన్నీటి బొట్టు జారింది.

ఆమె కన్నీటిని ఒక్క కృష్ణమూర్తి మినహాగా ఆ డ్రాయింగ్ రూమ్‌లో వున్న వ్యక్తులెవరూ చూడలేదు. ఒకవేళ చూసినా ఆ కన్నీరు ఎందుకో-ఎవరికోసమో వారికి తెలియదు.

కాని—కృష్ణమూర్తికి అకన్నీటి కథ తెలుసు!

ఒక్క కృష్ణమూర్తికే కాదు—ఇందిర ఉత్తరాన్ని రహస్యంగా తన కడుపులో దాచుకున్న కృష్ణమూర్తి ఐరన్ సేఫ్‌కీ తెలుసు !!